# మంద మధురం

ఉన్నట్లుండి జీవితం చాలా ఇరుకైపోయినట్లు అయింది సుదర్శనానికి. ఆకాశం దాకా అవకాశం విస్తరించి ఉన్నది అనుకుంటున్న మనిషి అకస్మాత్తుగా కుంచించుకుపోయినట్లయ్యాడు.

"ఇంకా నయం, నేను ముందుగా చూశాను గనుక సరిపోయింది. లేకపోతే, మన పత్రికకు ఎంత అప్రదిష్ట వచ్చేది! జనం మనను కాకుల్లా పొడుచుకు తినే వాళ్లు!" అన్నాడు సీనియర్ ఎడిటర్ - అతను రాసిన వ్యాసాన్ని కంపోజింగ్ సెక్షన్‌కు పంపకుండా నిలిపివేసి.

"అయినా నీ వన్నీ పాతకాలపు అలవాట్లేం! కనీసం వేయి, రెండు వేల సంవత్సరాల కిందటయితే ఇలాంటి మాటలు బాగుంటాయి. పోనీ, మీ రను కున్నట్లుగా ఒక ఆదర్శ రాజ్యం స్థాపనయితే మరో రెండు వేల సంవత్సరాల తరువాత ఈ అభిప్రాయాలు మన్నన పొందవచ్చు. కాని ఇప్పుడు, ఈ రోజుల్లో ఇటువంటి పోకడలు - అయ్యయ్యో! ఇంకేమైనా ఉందా?" అని చాలాసేపు నొచ్చుకున్నాడు కూడా.

సుదర్శనం ఏమీ బదులు చెప్పలేదు. తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయలేదు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి! ఎవరి అవస్థలు వారివి! అంతకన్నా చేసే దేముంది గనుక?

చేయదలచుకున్న ప్రతిదానికి ఏదో ఆటంకం. ఎక్కడ వేలు పెట్టి చూసినా ఏదో వికారమే.

సుదర్శనం చేసిన దేమిటంటే - ప్రజల్లో దురాశ పెరిగిపోతోంది. దీనిని అరికట్టకపోతే భవిష్యత్తుకే ఎంతైనా ప్రమాదం. అసలు మానవజాతి మనుగడ కష్టమైపోతుంది - అంటూ సుదీర్ఘమైన వ్యాసం రాశాడు. గుర్రపు పందేలు నిషేధించడం తప్ప మరో మార్గం లేదని సూచించాడు. అలాగే, చదువు కునే వాళ్ల దగ్గర వేలకు వేలు, లక్షలు విరాళాలు వసూలు చేయడం తప్ప

అన్నాడు. పెళ్లి చేసుకోవడం ఆడపిల్లకు ఎంత అవసరమో, మగవాడికీ అంతే గనుక కట్న కానుకలు, లాంఛనాలు చాలా అస్తవ్యస్తమన్నాడు. జనం ఆలోచనలకు 'గుడ్‌బై' చెప్పి, ఏదో దుష్ట శక్తి తమను ఈడ్చుకుపోతున్నట్లుగా, చీకటి గదుల్లో కూరుకుపోయి ఉన్నారని వాపోయాడు.

మతం, రాజకీయాల జోలికి మాత్రం పోలేదు. ఎవరిని నిందించలేదు. అయినా ఈ వ్యాసం ఆమోదయోగ్యం కాలేదు.

"ఎందుకురా, ఎప్పుడూ నువ్వే ఈ ప్రపంచమంతా మోసుకు తిరుగుతున్నట్లు ముఖం పెడతావు?" అనేవాళ్లు సుదర్శనాన్ని చిన్నప్పుడు స్నేహితులు - కాలేజీలో చదువుకునే రోజుల్లో - "ప్రతి సమస్య నువ్వే ఎందుకు నెత్తిన వేసుకుంటావు? ప్రతిదానికీ పరిష్కారం వెదకాలని ఎందుకు పరిశ్రమ చేస్తావు? జీవితాన్ని కులాసాగా, విలాసంగా గడిపేయడం నేర్చుకోకపోతే ఇక ఈ రోజుల్లో ఎలా పైకి వస్తావు?"

ఉద్యోగానికి వెళ్లడం ఇష్టం లేక గదిలోనే ఉండిపోయాడు. మనసు వెలితిగా, అయోమయంగా ఉన్నప్పుడు ఆఫీసుకు వెళ్లకుండా ఉండటమే మంచి పని. సమాధానపడిన తర్వాత ఒకటి రెండు రోజులకు వెళ్లినా మునిగిపోయేది ఏమీ లేదు. తాను వెళ్లకపోతే పత్రిక బయటకు రాదని బెంగ ఏమీ లేదు. మొదటి పేజీలో కాదు గదా, చివరి పేజీలలో కూడా తన గురించి ఏమీ రాయరు పత్రికలో.

ఎండ పొడలు కిటికీలో నుంచి గదిలోకి పడుతున్నాయి బాహాటంగా. ఎందుకైనా మంచిదని కిటికీ రెక్కలు మూసివేశాడు. వెలుతురు తగ్గిపోయింది. లైట్ స్విచ్ నొక్కాడు. వెర్రి వెలుతురు గదంతా ఆక్రమించుకుంది. కాని దానికీ, దీనికీ ఎంత తేడా! ఒకటి శరీరాన్ని కాల్చి నిజమైన సరుకు మాత్రం మిగిలేటట్లు చేస్తుంది. రెండోది మాయలఫకీరు మంత్రం చెప్పి సృష్టించినట్లుగా ఉంటుంది.

అమాయకంగా కనిపించేవాళ్లలోనే అగ్నిహోత్రం దాగిఉంటుందనే వాడు ఓ మిత్రుడు. ఎప్పుడూ ఏమీ తెలియనట్లు నంగనాచిలా ముఖంపెట్టి తిరిగే వాళ్లను అందరూ అనుమానంగానే చూస్తారు. అందుకని కొంత గాంభీర్యం, హుందాతనం పులుముకోవడం తప్పనిసరి.

జీవితం అనేది ఏక వాక్య కథా?

లేక అనేక ఖండికలతో కూడిన సంపుటా?

ముక్కముక్కలైపోయిన దాన్ని అతికించటానికి చేసే ప్రయత్నం అతుకు అతుకుగానే ఉంటుంది గాని పూర్వపు స్వరూపం రాదు. సరళరేఖగా కాకపోయినా, ఎన్నో ఎత్తుపల్లాలు - ఎగుడు దిగుళ్ళు ఉన్నా తెగిపోకుండా ముందుకు సాగిపోతూండడం జీవితం లక్షణం. అడ్డంగా గోడలు కట్టుకుని కూర్చుంటే 'క్రాస్ వర్డ్ పజిల్'గా తయారయిపోతుంది. నిలువుకు ఒక మాట సరిపోయిం దనుకున్నా, అది అడ్డానికి కూడా నప్పితే తప్ప ఖాళీ గడిలో రాయటానికి వీల్లేదు. నీతోపాటు పనిచేస్తున్న మరో మనిషి ఉండాలి. ఆ మనిషిని వెదికి పట్టుకుని, ఇద్దరమూ ఒకటయితే తప్ప జీవితానికి సాఫల్యం లేదు. సృష్టిలో ఆడ - మగలను గురించి ప్లేటో చెప్పిన సంగతులు మనసులో మెదిలాయి. జీవిత మంతా ఆ వెదుకులాటతోనే సరిపోతుందా? ఎన్నో సంవత్సరాల నుండి ప్రయత్నం చేస్తున్న పత్రికలో రోజూ వచ్చే 'పజిల్' సంపూర్ణంగా పూర్తి చేసి "హమ్మయ్య" అనుకోవడం సుదర్శనానికి ఈ రోజుకూ కుదరలేదు. ఒకటో, అరో మిగిలిపోతాయి.

ప్రపంచ మంతా పాడయిపోయింది అంటుంది శకుంతల. పాడయిపోవడం అంటే ఆ పిల్ల దృష్టిలో తాననుకున్నది అనుకున్నట్లుగా జరగకపోవడం.

"జీవితానికి భద్రత లేకుండా పోతోంది" అని శకుంతల అన్నప్పుడు, "అసలు భద్రత అంటే ఏమిటి చెప్పు కాస్త" అని అడిగాడు సుదర్శనం.

"నీ దంతా వ్యుత్పత్తి అర్థాల గందరగోళం" శకుంతల విసుక్కుంటూనే కొంతలో కొంత వివరించడానికి ప్రయత్నించింది.

"మనసుకు కొన్ని ఆలోచనలు ఉంటాయి. వీటివల్ల సుఖం, వీటివల్ల దుఖం అని తెలుస్తుంది దానికి ముందుగానే. సుఖం ఇచ్చేవే కావాలనీ, దుఃఖం తెచ్చేవి వద్దనీ ప్రతీ మనిషీ ప్రయత్నం చేస్తాడు. వస్తువులు, ఆలోచనలు తన కోసం కొన్ని కేటాయించుకుంటాడు. అవి ఇతరు లెవరూ దొంగలించకూడదు. అలా దొంగతనం జరగకుండా కాపలా మనుష్యుల్ని పెట్టుకుంటాం మనం. ఎవరో వచ్చి ఈ మనిషిని హత్య చేస్తాడు. అదీ!" అంది.

శకుంతలకు ఆలోచించడం వచ్చు. కాని ఎప్పుడూ తనపరంగానే ఎందుకు ఆలోచిస్తుంది? తనలాగే ప్రపంచంలో ఇతరులు కూడా ఉన్నారనీ, వాళ్లకూ ఏవో అభిరుచులు, వాటిని నిలబెట్టుకునే తాపత్రయాలు ఉంటాయని ఎందుకు తోచదు? తోచినా - ఇది తనకు అసౌకర్యం గనుక వెనక్కు నెట్టివేస్తుందా?

శకుంతలకు మంచి ఉద్యోగం ఉంది. అడగకపోయినా అన్నీ అమర్చిపెట్టే

తల్లీ, తండ్రి, అన్న, వదిన ఉన్నారు.

'ఇతరులను దృష్టిలో ఉంచుకుని నేనెందుకు పని చేయాలి' అన్న ధోరణి.

"దేవాలయం కడుతున్నాం. మీకు తోచిన చందా ఇవ్వండి!" అని వచ్చారు ఒక గుంపు మనుషులు.

"నా కేం తోచడంలేదు ఇప్పుడు. మీ అడ్రసూ, అదీ ఉన్న కాగితం ఇచ్చారు కదా. అవకాశం ఉన్నప్పుడు నేనే వచ్చి సమర్పించుకుంటాను లెండి!" అన్నాడు సుదర్శనం.

దైవభక్తి గురించి, దేవాలయాల ప్రాశస్త్యం గురించి చిన్నసైజు లెక్చర్ ఇచ్చాడు వాళ్ల నాయకుడు. "దేశం అంటే దేవాలయమే! అలా అనుకుంటేనే ముందుకు పోగలం" అన్నాడు.

దేహం కూడా దేవాలయమే కదూ! దేహాన్ని పోషించి, జీవుడిని నిలుపుకో వడం కూడా దేశ సేవే, దైవభక్తే - అనిపించింది సుదర్శనానికి. అందమైన గోపురాలు, ఆకాశాన్నంటే ధ్వజస్తంభాలు, తీర్చిదిద్దినట్లుగా ఉండే ప్రాకారాలు మనసుకు ఊరట కలిగిస్తాయి - దుమ్ము, ధూళి దూరంగా ఉంచగలిగితే.

సుదర్శనం ఇంకా విశ్రమించకుండానే వచ్చింది శకుంతల. "ఏం బయలు దేరవా?" అంది. కారు హారన్ తాను విననేలేదు. లేక, శకుంతల చప్పుడు చేయకుండా తీరుగా పైకి వచ్చేసిందేమో!

"ఊఁహూ, ఈ రోజు బద్ధకంగా ఉంది ఇలాగే ఉండిపోతాను" అన్నాడు బలహీనంగా.

"బద్ధకస్తుల జాబితాలో చేరిపోతావా? టూ బాడ్! వర్క్ ఈజ్ వర్షిప్ అనుకోవాలి కదా! ఇలా శేషతల్ప శయనుడిలా ఉండిపోతే ఎలా? లే, లే! ఓ పది నిముషాలు టైం ఇస్తున్నాను" అంది.

"నీకు ఆలస్యమయిపోతుంది. వెళ్లు, సాయంత్రం కలుసుకుందాంలే!" అన్నాడు సుదర్శనం. ఆమెను ఎలాగైనా పంపివేయడమే బుద్ధికి లక్షణంగా తోచింది.

"దేనికి ఆలస్యం? నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ అక్ట్ ప్రాకారం ఇవాళ నాకు సెలవు."

"చంపేశావు పో!" అన్నాడు అనాలోచితంగా.

"చంపినా సరే, చదునయినా సరే, ఇవాళ మనం వేసుకున్న ప్రోగ్రాం

పూర్తి కావలసిందే."

సుదర్శనానికి గుర్తురాలేదు ఆ ప్రోగ్రాం ఏమిటో. బహుశా ఏమీ ఉండి ఉండదు. లేక, శకుంతల ఏకపక్ష నిర్ణయం చేసేసి అతని మీద కూడా ఆ అభిప్రాయాన్ని రుద్దుదామని ప్రయత్నిస్తూ ఉండాలి.

"మనిషి పని చేయడం ముఖ్యమా, శకుంతలా?" అని అడిగాడు చాలా నిదానంగా.

"ఆ ప్రశ్నకు సమాధానం - పని అంటే నువ్వు చెప్పుకునే అర్థం మీద ఆధారపడి ఉంటుంది. గొప్ప తత్త్వవేత్తవు గదా! నీకు ఆ మాత్రం తెలియకుండా ఉందా? మీ శ్రీ కృష్ణుడు కూడా ప్రతి మనిషీ ప్రతి క్షణమూ పని చేస్తూ ఉండవలసిందే – పనిని గురించి ప్రతిఫలం మాత్రం అడగకూడదు అన్నాడుగా పెద్ద కేపిటలిస్ట్‌లాగా!"

శకుంతల తేనే తుట్టె కదిలించింది.

సుదర్శనం ఆలోచనలు ఎటో వెళ్ళిపోయాయి. శ్రీకృష్ణుడు సోషలిస్టా, లేక కమ్యూనిస్టా?

పత్రికలో ఇదో సమస్యగా ఇచ్చి దీని మీద పాఠకుల వ్యాస పరంపర ఆహ్వానించి వ్యాసాల మీద ఉత్తరాలు రాసిన వాళ్ల ఫోటోలు కూడా వేయవచ్చును.

"నిన్ను ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి, నేను తరువాత అనేక పనులు చూసుకోవాలి" అంది శకుంతల మళ్ళీ అతన్ని హెచ్చరిస్తూ.

"నేను ఆఫీసుకు వెళ్లనంటుంటే ఇలా వెంటపడతావేం? - అదేదో స్కౌట్ కుర్రాడు ముసలమ్మను అక్కర్లేకపోయినా రోడ్డు క్రాస్ చేయించినట్లు?" అన్నాడు ధైర్యం చేసి.

"ఆఫీసుకు వెళ్లకపోతే నాతో రా, ఇంట్లో ఇలా ఒక్కడివే కూర్చుని బూజు పట్టిపోతావా?"

'నా ఏడుపు నే నేదో అఘోరిస్తాను. అన్నీ నీకు చెప్పాలా?' అనుకున్నాడు మనసులో.

గదిని యుద్ధరంగంగా మార్చడం ఇష్టం లేక నోరు మూసుకుని ఉండిపోయాడు.

"ఇవాళ ఏదో ఒకటి తేల్చివేద్దా మనుకుంటున్నాను" అంది శకుంతల.

"నువ్వు అన్నీ తేల్చేస్తావు. అవతలివాడు మునిగి చస్తాడు."

"మంచి రిపోర్టీయే ఇచ్చావు గానీ, ఏదైనా సీరియల్ నవల రాసుకో. పేరుకు పేరు, డబ్బుకు, డబ్బు!" అంటు.

డబ్బు, పేరు తప్ప ఇంకేమీ ప్రేరేపించదా మనుషుల మనసుల్ని - అని ఆలోచనలో పడ్డాడు. అయినా తనకు నవల రాసేంత తీరిక, ఓపిక ఎక్కడున్నాయి? కారెక్టర్ల పేర్లు ప్రతి అధ్యాయానికీ మారిపోతూంటాయి. కథయితే పరవాలేదు. పది, పదిహేను నిముషాలలో ఒడ్డెక్కి, ఆ తరువాత అందరినీ మరిచిపోవచ్చును.

శకుంతల కిటికీ తలుపులన్నీ తెరిచింది.

టేబుల్ మీద పుస్తకాలు, కాగితాలు సవరించినట్లు చేసి, నటించి - అన్నీ చూసింది.

అకస్మాత్తుగా ఎక్కువ గాలి, వెలుతురు లోపలకు తెచ్చి కొన్ని నిముషాలు అతన్ని అతలాకుతలం చేసింది.

సుదర్శనం స్నానం చేసి వచ్చాడు.

"అదీ, అలా మైడియర్ గుడ్ బాయ్‌లాగా తయారయ్యావు. అందుకే నువ్వంటే నాకు ఇష్టం!" అంది శకుంతల.

"నన్నేం కాన్వెంట్ స్కూలుకు పంపుతున్నావా? కేజీ తరగతిలో పడేస్తావా?" అన్నాడు సుదర్శనం వేళాకోళంగా.

"వేరే స్కూలు ఎందుకు? జీవితమే ఓ పెద్ద పాఠశాల అంటావు కదా!"

"అవును, ఆ పాఠాలు మనం నేర్చుకుంటున్నామా?"

"మనం అని నన్ను కలపకు. ఇద్దరి తరపున నేర్చుకోవలసిందేదో నీవే నేర్చుకో. నాకు ఇప్పుడు ఓపిక లేదు" అంది శకుంతల.

'జీవితంలో తాను నేర్చుకోవలసిందేమీ లేదని ఎంత భరోసా ఈ పిల్లకు!' అని మళ్లీ ఆశ్చర్యపడ్డాడు సుదర్శనం.

మంచి మాటలతో నేర్చుకోవలసినవి తెలుసుకోలేకపోతే జీవితం మొట్టికాయలతో నేర్పుతుంది అన్న సంగతిని శకుంతలకు అర్థమయ్యేటట్లు చెప్పడం ఎలా?

"అయితే నన్ను ఆఫీసుకు వెళ్లిపొమ్మంటావా?" అనడిగాడు - లేకపోతే రోజంతా శకుంతలతోనే గడిపేయవలసి వస్తుందని భయపడుతూ.

"వెళ్లనంటున్నావుగా, నాతో రా!"

"మనసు మార్చుకుంటాను" అన్నాడు సుదర్శనం భయం భయంగా.

"అంత తేలిగ్గా ఎలా మార్చుకుంటావయ్యా! అయినా, ఇప్పుడు మార్చుకోవలసిన అవసరం ఏం వచ్చింది? ఊ, త్వరగా తయారుకా! అవతల అమ్మమ్మ వచ్చేస్తోంది" అంది శకుంతల.

అర్థం కానట్లు ఆమె ముఖం వంక చూశాడు.

"ఇంకో అరగంటలో మా అమ్మమ్మ ఈ మహానగరానికి రాబోయే ఎక్స్‌ప్రెస్‌లో విజయం చేస్తున్నారు. శకుంతలకు ఆఫీసు లేదు గనుక అమ్మమ్మను ఇంటికి జాగ్రత్తగా తీసుకువచ్చే పని కేటాయించడం జరిగింది - తెలిసిందా?"

"అయితే నే నెందుకు, అమ్మమ్మకు మనుమరాలికీ మధ్య?"

"అదే గదా విచిత్రం! అసలు అమ్మమ్మ వస్తున్నది నా కోసం అనుకుంటున్నావా? కాదు, నిన్ను చూడటానికే! మళ్లీ మొదటికి వచ్చి కూర్చుంటావు నువ్వు ప్రతిసారీ!" అంది శకుంతల పెద్ద కథను సంక్షిప్తం చేస్తూ.

నాయనమ్మ అప్రూవల్ ఇదివరకే అయిపోయింది.

అమ్మమ్మ కూడా శంఖంలో తీర్థం పోస్తే ఇక అడ్డంకి ఏమీ ఉండదు.

'లవ్ మేరేజ్‌ని ఎరేన్జ్‌డ్ మారేజ్‌గా రూపాంతరం చెందిస్తోంది శకుంతల. ఈ పిల్ల ప్రజ్ఞకు రాక్షసుడు, చాణక్యుడు కూడా చాలరు' అనుకున్నాడు మనసులో సుదర్శనం.

జీవితం అంతా ఇలాగే సునాయాసంగా, తాను ఏమీ చేయనక్కరలేకుండా శకుంతల డిక్టేటర్స్‌కు లొంగిపోతూ గడిపివేయవలసిందేనా? అయినా ఇందులో కూడా ఏదో తెలియచెప్పరాని, తోసివేయజాలని ఆనందం ఉన్నది కదూ! తాను ఉద్యోగం చేసినా, చేయకపోయినా ఒక్కటే శకుంతలక్కు.

అవసర మనుకున్న పనులు వెంటనే చేసెయ్యాలి.

ఎవరినీ ఏమీ అనకుండా, నిష్ఠూరాలు, బరువులు కుంగదీయకుండా జీవిత రహస్యం అంతా అర్థం అయిపోవాలి. మనిషిగా ఉంటే చాలదు. మహా పురుషుడు కావాలి. మందార మకరందాల మాధుర్యంలో తేలే మహాత్ముడి దర్శనం కావాలి.

"పద, పద! తొందరగా, నేను పేరు మార్చుకోవాలి" అంది శకుంతల.

"ఏమని మార్చుకుంటావు? - శూర్పణఖ అనా?"

కోపంగా చూసింది.

"తెలియక అన్నాను, సత్యభామ అని మార్చుకుంటావు కాబోలు. అయినా, నీ పేరు - నీ ఇష్టం!" అన్నాడు తప్పించుకుంటున్న ధోరణిలో.

"నా ఇష్టమే! అయినా నా కోసం కాదు. నీ కోసం ఈ మార్చుకోవడం."

"అలాగా!" అన్నాడు పొడిగా.

"ఏమని మార్చుకుంటానో ఊహించు. నువ్వు సుదర్శనమయితే నేను ఏమవ్వాలి - సహచరిణి, సహ కార్యాసక్తురాలిని కావాలంటే?"

సుదర్శనం జవాబు చెప్పలేదు.

శకుంతల అసహనంగా - "మట్టిబుర్ర! ఆలోచించడమే తప్ప, అవగతం చేసుకోవడం చేతకాదు. ఈ సాయంకాలం నుంచి నాపేరు 'పాంచజన్యం' అంది."

జీవితం సువిశాలమైన ఉద్యానవనంలా అనిపించింది.

ఇరుకులన్నీ మరుగైపోయాయి సుదర్శనానికి.